క్లుప్తంగా

విద్య, పౌష్టికాహారంపై ఆరా



విద్యార్థినులతో మాట్లాడుతున్న ట్రెయినీ కలెక్టర్లు

ఇచ్చోడ: మండలంలోని మేడిగూడ ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు అందుతున్న విద్య, పౌష్టికాహారంపై ట్రెయినీ కలెక్టర్లు మంగళవారం ఆరా తీశారు. వారికి ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఆశ్రమాల్లో ఎంతమంది విద్యార్థులు ఉన్నారని తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన ప్రతినిధి ముసోరియా, ఐటీడీఏ పీవో చాహత్‌బాజ్‌పాయ్, డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ రామారావు, ఏటీడీవో సౌజన్య ఉన్నారు.

ఎమ్మెల్యే దంపతుల పూజలు



పాల్గొన్న ఎమ్మెల్యే జోగు రామన్న దంపతులు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బెల్లూరి అయ్యప్ప ఆలయంలో సాయికృష్ణ దుబే గురుస్వామి ఆధ్వర్యాన మంగళవారం తిరుఓనమ్ ఉత్సవాలు కొనసాగాయి. స్వామివారికి అభిషేకం, దివ్య నెట్టాంబడి పూజలు తదితర నిర్వహించారు. ఎమ్మెల్యే జోగు రామన్న దంపతులు పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు కాంబోజి సూర్యకాంత్, ప్రధాన కార్యదర్శి రవీందర్, దిలీప్ గురుస్వామి పాల్గొన్నారు.

విత్తన దుకాణాల తనిఖీ



తనిఖీ చేస్తున్న ఏవో

తలమడుగు: మండలకేంద్రంతోపాటు లింగి గ్రామంలో విత్తన, ఫర్టిలైజర్ దుకాణాలను ఏవో మహేందర్ మంగళవారం తనిఖీ చేశారు. స్టాక్ రికార్డులు పరిశీలించారు. విత్తన ధర స్టాక్ లభ్యత వివరాలు తెలిపే బోర్డులు షాపు ఎదుట పెట్టాలని సూచించారు. రైతులకు విత్తనాలు విక్రయిస్తే రసీదు అందించాలన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి

ఇంద్రవెల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని భీం ఆర్మీ మండల అధ్యక్షుడు సూర్యవంశీ ఉత్తం అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలను మంగళవారం సందర్శించి హెచ్ఎం గోపాల్‌సింగ్‌తిలవత్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల చుట్టూ 9 ఫీట్ల ప్రహరీ నిర్మించాలన్నారు. పాఠశాల ఆవరణ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. బహుజన సంఘాల నాయకులు సోన్‌కాంబ్లే బాబాసాహెబ్, కాంబ్లే రాజేందర్, విక్రం ఉన్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న వైద్యుడు ప్రదీప్

ఆదిలాబాద్‌రూరల్: కుష్ఠువ్యాధి సర్వే పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ ప్రదీప్ పేర్కొన్నారు. కుష్ఠు వ్యాధి పక్షోత్సవాల్లో భాగంగా ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి పీహెచ్‌సీ, తంతోలి, మామడిగూడ సబ్ సెంటర్లను మంగళవారం సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. ఎవరికైన కుష్ఠు వ్యాధి లక్షణాలు ఉంటే వారి పేర్లను వెంటనే నమోదు చేసుకోవాలన్నారు. వారికి చికిత్స అందించాలన్నారు. జిల్లా లెప్రాసి అధికారి డాక్టర్ శ్రీకాంత్, మండల వైద్యాధికారి డాక్టర్ రాహుల్, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్లు సిడాం వామన్‌రావ్, మధుసూదన్‌రావ్, హెల్త్ సూపర్ వైజర్లు, ఆరోగ్యకార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు ఉన్నారు.

'సౌకర్యాల కల్పనలో విఫలం'

జైనథ్: ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి అన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని తరోడా వద్ద కొట్టుకుపోయిన పైపులైన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జైనథ్, బేల మండలాలకు నీటి సరఫరా లేక ప్రజలు అల్లాడుతుంటే ఎమ్మెల్యే జోగు రామన్న స్పందించకపోవడం శోచనీయమన్నారు. పైపులు దెబ్బతిని 45 రోజులుగా గడిచినా కనీసం మరమ్మతు చేయించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఈ విషయంపై సంబంధిత శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన ఆమె..వారంలోగా సమస్య పరిష్కారమయ్యేలా చూడాలని కోరారు. పార్టీ నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

ఆన్‌లైన్‌లో 'గృహలక్ష్మి' వివరాలు

- నమోదు చేస్తున్న కార్యదర్శులు
- ఇంటింటికీ సర్వే పూర్తి



బేల ఎంపీడీవో కార్యాలయంలో ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

బేల: గృహలక్ష్మి అర్హుల వివరాలను ఇటీవల నాలుగు రోజుల నుంచి ఆన్‌లైన్‌లో పంచాయతీ కార్యదర్శులు నమోదు చేస్తున్నారు. దరఖాస్తుల నుంచి అర్హులు గుర్తించే క్రమంలో ప్రతీసారి రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిబంధనలు మారుతున్నాయి. ఈ క్రమంలో అధికారులు, కార్యదర్శులు సతమతమవుతున్నారు. గృహలక్ష్మి పథకం కింద డబుల్ బెడ్రూం ఇళ్లు ఇంకా ఎవరికీ దక్కుతాయోనని ప్రశ్నార్థకంగా మారింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈనెల 8, 9,10 తేదీల్లో గృహలక్ష్మి దరఖాస్తులు స్వీకరించారు. మండల మొత్తం 5,257 దరఖాస్తులు వచ్చాయి. మండలంలో 37 పంచాయతీలు ఉండగా, అత్యధికంగా బేల పరిధిలో వచ్చిన దరఖాస్తులు 538. సైద్‌పూర్‌లో 269, చప్రాలలో 264, దహెగాంలో 263, సదల్‌పూర్‌లో 246, కొగ్దూర్‌తో పాటు బెదోడలో 200చొప్పున గరిష్ఠంగా దరఖాస్తులు వచ్చాయి. అత్యల్పంగా పాహర్ పంచాయతీ పరిధిలో కేవలం 24 దరఖాస్తులు వచ్చాయి.

ప్రస్తుతం మారిన నిబంధనలు

గృహలక్ష్మి దరఖాస్తుల అధారంగా ఈనెల 14 నుంచి 23 వరకు పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో ఇంటింటికీ వెళ్లి పరిశీలన సర్వే పూర్తిచేశారు. సర్వేలో మొత్తం వచ్చిన 5,257 దరఖాస్తుల్లో 1200లు అనర్హులుగా గుర్తించారు. సర్వే చేస్తున్న క్రమంలో నిబంధనలు మారుతండడంతో అర్హులను గుర్తించడంలో అధికారులు, కార్యదర్శులు సతమతమవుతున్నారు. ఇందిరమ్మ ఇళ్లు, స్లాబ్ ఇళ్లు ఉంటే అనర్హులుగా గుర్తించాలని, తర్వాత అర్హులుగా గుర్తించాలని నిబంధనలు వచ్చాయి. ఈనెల 21న 2014 ఏప్రిల్ వరకు ఇంటివన్ను డిమాండ్ రిజిష్టర్‌లో పేర్లు ఉంటేనే అర్హులుగా గుర్తించాలని, ఆ తర్వాత ఇళ్ల స్థలాలు క్రయ, విక్రయాలు చేసిన వారిని అనర్హులుగా గుర్తించాలని నిబంధనలున్నాయి. ఇవన్నీ మార్పు చేయగా ప్రస్తుత నిబంధనలు ఇలా..స్లాబ్ లేని పూర్తిస్థాయి ఇందిరమ్మ ఇళ్లు ఉన్న వారిని పక్కనపెట్టి, రెండో దఫాలో అవకాశం కల్పిస్తూ అర్హులుగా గుర్తించాలని సూచనలు వచ్చాయి.

ఏజెన్సీ ప్రాంతంలో..

ఏజెన్సీ ప్రాంతంలోని గ్రామ పంచాయతీల్లో 1970 తర్వాతి గిరిజనేతరులను అనర్హులుగా గుర్తించాలని నిబంధనలు వచ్చాయి. ఇలా అర్హులుగా గుర్తించిన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలాల డాక్యుమెంట్, ఇంటి పన్ను రసీదు తప్పనిసరి. మళ్లీ ఈ ప్రకారం అర్హులు గుర్తించి, తుది జాబితా సిద్ధం చేయాలని ఇటీవల ఆదేశాలు వచ్చాయి. ఇదంతా పూర్తి చేసి, వారి వివరాలను ఆన్‌లైన్‌లో గృహలక్ష్మి వెబ్‌సైట్‌లో నమోదు చేస్తారు. ఒకవేళ అర్హులు అధిక సంఖ్యలో ఉంటే గ్రామాల వారీగా కేటాయింపు ప్రకారం లక్కీడ్రా పద్ధతిన లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు.

అర్హులకు మంజూరు చేయాలి

గృహలక్ష్మి పథకాన్ని అర్హులకు మంజూరు చేయాలి. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి ప్రస్తుత ఇంటి పరిస్థితిని చూసి అర్హులను గుర్తించాలి. ఇంటి స్థలం ఉండి ఇల్లు కట్టుకోలేని స్థితిలో ఉన్న నిరుపేదలకు న్యాయం చేయాలి.

– మాడ లక్ష్మి, బేల

సాయం కోసం ఎదురుచూపు

మండల కేంద్రంలో ఇంటి స్థలం ఉంది. ఇంటిని నిర్మించుకునే స్తోమత లేదు. ఏళ్ల నుంచి ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నా. గృహలక్ష్మి ద్వారా ఇంటి నిర్మాణం జరిగేలా చూడాలి.

– బాల్డె గంభీర్, బేల

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



రాంమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లెక్చరర్లు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో గిడుగు రాంమూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ జగ్‌రాం మాట్లాడుతూ ప్రధాని మోదీ మన్‌కీ బాత్‌లో ఆగస్టు 29ను తెలుగు భాషా దివస్‌గా ప్రకటించడం హర్షణీయమన్నారు. లెక్చరర్లు సంతోష్‌కుమార్, కపీల్, శ్రీనివాస్, రఘునాథ్, ప్రతాప్ సింగ్, కె.రమేశ్, విజయ్, నర్సింగ్‌రావు, నారాయణ పాల్గొన్నారు.

బోథ్: సొనాల గ్రామంలో వివేకానంద పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యోగానదం స్వామి, రామగిరి ప్రకాశ్‌ను సన్మానించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు సంగీత, అధ్యాపకులు శ్రావణి, శ్రీదరదేవి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ తక్షశీల, వైస్ ప్రిన్సిపాల్ విజయ పాల్గొన్నారు.

'బైపాస్ కోసం సాగు భూములు ఇవ్వం'



మాట్లాడుతున్న ఆర్డీవో స్రవంతి

బేల: తహసీల్దార్ కార్యాలయంలో బేల పక్కన బైపాస్ రహదారి నిర్మాణంపై భూ నిర్వాసితులతో ఆదిలాబాద్ ఆర్డీవో స్రవంతి మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా 4.15 కి.మీ బేల బైపాస్ రోడ్డు నిర్మాణం సర్వే కోసం రైతులు సహకరించాలని కోరారు. 40 మంది బాధిత రైతులు మాట్లాడుతూ సాగు భూములను బైపాస్ రహదారికి ఇవ్వమని, సర్వేను అడ్డుకుంటామన్నారు. బేల మార్గంలో పాత రహదారి మార్గంలో చేపట్టాలని డిమాండ్ చేశారు. దీంతోపాటు రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ఆర్డీవో పేర్కొన్నారు. సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఉమేందర్, తహసీల్దార్ వేణుగోపాల్, నేషనల్ హైవే ఏఈ భూపేష్, ఎస్సై రాధిక పాల్గొన్నారు.

పౌష్టికాహారం కోసమే రాగిజావ

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకంతోపాటు ప్రతీరోజు రాగిజావ అందించనున్నట్లు డీఈవో ప్రణీత అన్నారు. జిలా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల నం.2లో రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం, సత్యసాయి ట్రస్ట్ సౌజన్యంతో రాగిజావతో పాటు పల్లిపట్టీలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ ఏడీ నర్సిములు, జిల్లా సైన్స్ అధికారి రఘురమణ ఉన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



విజేతలతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు



విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఎదులాపురం: హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ జయంతి పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వాలీబాల్, చెస్, బాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రిన్సిపాల్ జగ్రామ్ బహుమతులు అందించారు. అధ్యాపకులు జాకీర్‌హుస్సేన్, సంతోష్‌కుమార్, రఘునాథ్, ప్రతాప్, రమేశ్, నర్సింగరావు, విజయ్‌కుమార్, జ్యోత్స్న, ఆనంద్, కపిల్ పాల్గొన్నారు.

నార్నూర్: మండలంలోని జామ్‌డా బాలికల ఆశ్రమ పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. రాష్ట్ర స్థాయిలో అండర్ 16, 800 పరుగు పందెంలో రాణించి అంజలిని సన్మానించారు. హెచ్ఎం చౌహాన్ నెహ్రూ, పీడీ అడే విశ్వనాథ్ ఉన్నారు.

నేరడిగొండ: లఖంపూర్ గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. 2022–23 సంవత్సరానికి ఇంటర్ సొసైటీ క్రీడా పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సన్మానించారు. హెచ్ఎం అశోక్‌రావ్, వ్యాయామ ఉపాధ్యాయురాలు రాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: ధ్యాన్‌చంద్ దేశం గర్వించదగ్గ గొప్ప హాకీ క్రీడాకారుడని ఎస్ఎంసీ చైర్మన్ జాంసింగ్ తెలిపారు. మండల కేంద్రంలోని శ్రీసరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో విద్యార్థులకు క్రీడలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. హెచ్ఎంలు వెంకటరమణ, రమణ, స్వప్న, మణిదీపిక పాల్గొన్నారు.

అన్నాభావుసాఠే ఆదర్శప్రాయుడు

- ఎమ్మెల్యే జోగు రామన్న



సాఠే విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు, అధికారులు

ఆదిలాబాద్‌రూరల్: సాహిత్య సామ్రాట్ అన్నాభావు సాఠే అందరికీ ఆదర్శప్రాయుడని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్‌లోని అంబేద్కర్‌నగర్‌లో సాఠే 103వ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహనీయులు, సాఠే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సమసమాజ నిర్మాణానికి పాటుపడ్డ మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సన్మానించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఇజ్జగిరి నారాయణ, దుర్గం ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్, సంఘ సభ్యులు వాసుదేవ్, మహిళా సంఘం అధ్యక్ష కార్యదర్శులు స్వరూపరాణి, మమత, పర్వీన్ పాల్గొన్నారు.

గుడిహత్నూర్: మండల కేంద్రంలో అన్నాభావు సాఠే జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఛత్రపతి శివాజీ చిత్రపటానికి, అంబేద్కర్, కుమురం భీం విగ్రహాలకు పూలమాలలు వేశారు. జెడ్పీటీసీ బ్రహ్మానంద్, ఎంపీపీ భరత్, ఎస్సై ఇమ్రాన్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సాఠే జయంతిని నిర్వహించారు. గజానంద్‌మాళి, వెడ్మ భొజ్జు , సంజీవ్ పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: బోస్రా గ్రామంలో సాఠే జయంతి వేడుకల్లో నాయకులు సూర్యకాంత్, గైక్వాడ్ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

'గొర్రెల పంపిణీలో మోసం'



ధర్నా నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు, రైతులు

ఆదిలాబాద్‌టౌన్: గొర్రెల పంపిణీలో బీఆర్ఎస్ ప్రభుత్వం మోసానికి పాల్పడుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని పశుసంవర్ధక శాఖ కార్యాలయం ఎదుట రైతులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018లో గొర్ల, కుర్మలకు రెండో విడత గొర్రెలు రాని వారికి పంపిణీ చేస్తామని హామీ ఇచ్చినా ఇంత వరకు నెరవేర్చలేదని తెలిపారు. ఆదిలాబాద్‌లో 2200 మంది లబ్ధిదారులు ప్రభుత్వానికి రూ.43,750 చొప్పున డీడీ రూపంలో చెల్లించారని, కేవలం 220 మందికి మాత్రమే గొర్రెలను పంపిణీ చేయడం సిగ్గుచేటన్నారు. డీడీలు కట్టిన లబ్ధిదారులు పశుసంవర్ధక శాఖ కార్యాలయం చుట్టూ తిరిగితే పొంతనలేని సమాధానాలు ఇస్తున్నారని పేర్కొన్నారు. డీడీలు కట్టిన లబ్ధిదారులకు వడ్డీ కలిపి డబ్బులను తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు లాలమున్న, జోగు రవి, శ్రీనివాస్, భీంసేన్‌రెడ్డి, మహేందర్, సురేందర్, సాయి, మటోలియా పాల్గొన్నారు.

'ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా'

ఇచ్చోడ: తనను ఆశీర్వదించండి.. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్‌జాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని జామా మసీద్‌లో ముస్లిం మతపెద్దలతో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ గడ్డ మీద పుట్టిన వ్యక్తిగా ఇక్కడి ప్రాంత సమస్యలపై పూర్తిగా అవగాహన ఉందన్నారు. అంతకుముందు సిరికొండ మండలంలోని పొన్న ఎంపీటీసీ చౌహాన్ సూర్యకాంత్‌ను వారి స్వగృహంలో కలిశారు. మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ లోక శిరీష్‌రెడ్డిని కలిసి మాట్లాడారు. ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, ముఖరా(బి) ఎంపీటీసీ గాడ్గే సుభాష్, మాజీ మండల కన్వీనర్ మోహరాజ్ అహ్మద్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు పాండురంగ్, నాయకుడు రమేశ్ పాల్గొన్నారు.

నేరడిగొండ: సీఎం కేసీఆర్‌తోనే అందరి కలలు సాకారమవుతాయని బోథ్ బీఆర్ఎస్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. కుమారి గ్రామంలో మంగళవారం పర్యటించగా ప్రజలు స్వాగతం పలికారు. ముందుగా బీఆర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామంలోని ఆంజనేయ స్వామి, గురు దేవా సేవ ఆశ్రమం, సత్యనారాయణ స్వామి, శబరిమాత ఆశ్రమాలను దర్శించుకున్నారు. మండల కన్వీనర్ శివారెడ్డి, స్థానిక సర్పంచ్ రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా రంజానీ

కైలాస్‌నగర్: టీపీసీసీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా వసీం రంజానీ నియమాకమయ్యారు. డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ మంగళవారం జిల్లాకేంద్రంలోని తన నివాసంలో ఆయనకు నియమాకపత్రం అందజేశారు. పార్టీ అభివృద్ధి కోసం పాటుపడాలని సూచించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు జి.నగేశ్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు రసూల్‌ఖాన్, మాజీ కౌన్సిలర్ ముర్తుజా తదితరులు పాల్గొన్నారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి

బజార్‌హత్నూర్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పత్తిలో చీడపీడల బెడద ఉంటుందని, రైతులు వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏడీఏ శ్రీధర్‌స్వామి అన్నారు. మండలంలోని వర్తమన్నూర్, పిప్రి గ్రామాల్లో మంగళవారం పత్తి పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ఏఈవో కృష్ణపాల్, రైతులు శ్రీనివాస్, శంభు, ఆశన్న ఉన్నారు.

9న జాతీయ లోక్‌అదాలత్

ఉట్నూర్‌రూరల్: న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఉట్నూర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నాయమూర్తి తులసీ దుర్గారాణి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ మండలాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాజీమంత్రి భీంరావు వర్ధంతి

ఉట్నూర్‌రూరల్: స్వర్గీయ మాజీమంత్రి కోట్నాక్ భీంరావు ఆశయాలు కొనసాగిస్తామని ఆయన తనయుడు రమేశ్ అన్నారు. స్థానిక భీంరావు చౌక్ వద్ద భీంరావు వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గిరిజన నాయకులు జాదవ్ సునీల్, వెడ్మ భొజ్జు, తిరుపతి పాల్గొన్నారు.

వేధింపులకు గురిచేస్తే ఫిర్యాదు చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: మహిళలను వేధింపులకు గురిచేస్తే డయల్ 100, 181, 1098 నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ యశోద అన్నారు. పట్టణంలోని జైనథ్ సీడీపీఓ కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బేటి బచావో.. బేటి పడావో.. సుకన్య సమృద్ధి యోజన తదితర పథకాల గురించి అవగాహన కల్పించారు.

సెల్‌ఫోన్ అప్పగింత

గుడిహత్నూర్: మండలంలోని గర్కంపేట్‌కు చెందిన పర్చకే మనోజ్‌కుమార్ గత జూన్‌లో ఫోన్ పోగొట్టుకున్నాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్‌లో ఐఎంఈఐ, తదితర వివరాలు నమోదు చేశారు. ఫోన్ సిగ్నల్ ఆధారంగా పోలీసులు ట్రేస్ చేసి ఫోన్‌ను పట్టుకున్నారు. ఎస్సై ఇమ్రాన్ మంగళవారం బాధితుడికి ఫోన్ అప్పగించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలో 40 మంది లబ్ధిదారులకు జెడ్పీటీసీ మల్లేపూల నర్సయ్య మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ శ్రీనివాస్, సర్పంచ్ పరచ లావణ్య సాయన్న, బీఆర్ఎస్ మండల కన్వీనర్ కానిందే రాజారాం, డిప్యూటీ తహసీల్దార్ హరిలాల్ పాల్గొన్నారు.

మహాధర్నా జయప్రదం చేయండి

తలమడుగు: సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్‌తో హైదరాబాద్‌లో సెప్టెంబర్ 1న నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఏ.స్వామి కోరారు. మండలంలోని పల్లి(బి), పల్లి(కె), నందిగామ, పునగూడ, ఉమ్రి పాఠశాలలో మంగళవారం మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు రాథోడ్ రవీందర్, ఉపాధ్యక్షుడు ఎస్.చిన్నయ్య, కార్యదర్శి కె. శంకర్, హెచ్ఎం ప్రేమ్‌దాస్, నాయకుడు కాంతారావు పాల్గొన్నారు.

నేడు స్పాట్ అడ్మిషన్

ఇచ్చోడ: ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని బుగ్గారాం గిరిజన బాలికల కళాశాలలో ఇంటర్ హెచ్ఈసీ గ్రూప్‌లో మిగిలిన 6 సీట్ల కోసం బుధవారం స్పాట్ అడ్మిషన్ నిర్వహిసున్నట్లు ప్రిన్సిపాల్ క్రిష్ణివేణి ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్టీ అభ్యర్థులు అర్హులని, ఉదయం 10 గంటలకు అడ్మిషన్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

వైద్యశిబిరం

బజార్‌హత్నూర్: మాడగూడ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో మెడికల్ ఆఫీసర్ భీంరావ్ ఆధ్వర్యంలో మంగళవా వైద్యశిబిరం నిర్వహించారు. 65 మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. హెచ్ఎం సుదర్శన్ ఉన్నారు.

గొర్రెల పంపిణీ

బజార్‌హత్నూర్: రెండోవిడత గొర్రె పంపిణీలో భాగంగా దేగామలో వైస్ ఎంపీపీ శ్రీనివాస్ అధ్వర్యంలో ముగ్గురు లబ్ధిదారులకు గొర్రెలు పంపిణీ చేపట్టారు. పశువైద్యాధికారి పర్వేజ్ అహ్మద్ ఉన్నారు.

విద్యార్థులకు సన్మానం

తాంసి: మండల కేంద్రానికి వికాస్, వివేక్ అన్నదమ్ములు ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ కనబర్చి ఎంబీబీఎస్, ఇంజినీరింగ్ విభాగంలో సీట్లు సాధించారు. వీరిని గ్రామంలోని అంబేద్కర్ భవన్‌లో అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు సన్మానించారు.

సన్మానం

తలమడుగు: తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్ అసోసియేషన్ జిల్లా కార్యనిర్వాక అధ్యక్షుడిగా ఎన్నికైన సూర్యకాంత్‌ని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు సన్మానించారు.

బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడిగా రాజ్‌కుమార్

ఉట్నూర్‌రూరల్: బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడిగా సాడిగే రాజ్‌కుమార్ నియమితులయ్యారు. ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ అతన్ని సన్మానించారు. ఎంపీపీ జైవంత్‌రావు, వైస్ ఎంపీపీ బాలాజీ, రమేశ్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

బోథ్: ధన్నూర్(బి), అందూర్, మందబొగడ, బిర్లాగొంది, మర్లపెల్లి, బాబెరతాండ, నిగిని గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ సుభాష్ చంద్ర మంగళవారం పరిశీలించారు. ఆర్ఐ దశరథ్; బిఎల్ఓలు ఉన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రాన్ని ప్రారంభించండి

నార్నూర్: గాదిగూడ మండలంలోని ఝరి పీహెచ్‌సీ పరిధిలో డాబా(కే) గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రాన్ని ప్రారంభించాలని గ్రామస్తులు వైద్యాధికారి సంజీవ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. గ్రామ పెద్దలు కుంరం పైకు పటేల్, సోయం ఆనందరావు, యూత్ సభ్యులు ఉన్నారు.

'ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పిస్తాం'

ఉట్నూర్‌రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పిస్తామని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ భొజ్జు పటేల్ అన్నారు. మండలంలోని బీర్సాయిపేట, భూపేట్, రాంనగర్, టవర్‌గూడ, మోతీరాంగూడ గ్రామాల్లో మంగళవారం గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు రాజేశ్, అఫ్రోజ్, అబ్దుల్ ఖయ్యుం ఉన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ఆదిలాబాద్‌టౌన్: చట్టాలపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని షీటీం ఇన్‌చార్జి ఏఎస్సై సునీత అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థినులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

అందరి సమన్వయంతోనే అభివృద్ధి

బోథ్: ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతోనే మండల అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ తుల శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక షాదీఖానాలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. కాగా, తాము పనులు చేసినా బిల్లులు రాలేదని పలువరు సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే బిల్లులు చెల్లించాలని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా చేయాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. పంట నష్టాన్ని షరతు లేకుండా అంచనా వేసి ప్రభుత్వానికి అందించాలని, ఉపాధ్యాయుల డిప్యూటేషన్‌ను రద్దు చేయాలని పలువురు సర్పంచులు డిమాండ్ చేశారు.

'అట్రాసిటీ కేసు నమోదు చేయాలి'

బేల: బురాన్‌పూర్ శివారులో మర్సుకోల రాంజీ గోండ్, కుంరం సూరు జెండాలను తొలగించిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు ఆడ శంకర్, ఉపాధ్యక్షుడు నైతం సీతరాం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేసి, చర్యలు తీసుకోవాలని లేకపోతే బేల జీపీ, ఎంపీడీవో కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరించారు. సర్పంచ్ కొరంగే జంగ్‌షా, నాయకులు నందకుమార్, రాందాస్, భీంరావు, సంబు పాల్గొన్నారు.


ఎంఈవో వేధింపులపై ఫిర్యాదు

ఆదిలాబాద్‌టౌన్: బజార్‌హత్నూర్ మండలం బుర్కపల్లికి చెందిన ఓ ఉపాధ్యాయురాలిపై బజార్‌హత్నూర్ ఎంఈవో వేధింపులకు పాల్పడుతున్నారని ఎస్టీయూ సంఘం అధ్యక్షుడు గడుగు నరేందర్ అన్నారు. మంగళవారం డీఈవో ప్రణితకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో 317 ద్వారా ఆసిఫాబాద్ నుంచి ఆదిలాబాద్ జిల్లాకు ఆ టీచర్ బదిలీ అయ్యారన్నారు. స్కూల్ అలోకేషన్ మండలంలోని బలన్‌పూర్‌కు చేయాల్సి ఉండగా, అధికారుల తప్పిదంతో బుర్కపల్లికి కేటాయించారని పేర్కొన్నారు. బలన్‌పూర్ పాఠశాలకు కేటాయించాలని ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లగా, బుర్కపల్లికి వెళ్లాలని ఒత్తిడి చేస్తున్నారని పేర్కొన్నారు. కేటాయించిన స్కూల్‌కు వెళ్లకుంటే తాను వెళ్లి విధులు నిర్వహిస్తానని సదరు ఎంఈఓ ఆమెను మానసికంగా వేధిస్తున్నారని తెలిపారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

నేరడిగొండ: 18 ఏళ్లునిండిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సాయిచైతన్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సామరాజ్ కిరణ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కళాశాలలో ఓటు నమోదు కార్యక్రమంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషా దినోత్సవం ప్రత్యేకత గురించి తెలియజేశారు. తెలుగు లెక్చరర్ దినేష్‌ను సన్మానించారు. వైస్ ప్రిన్సిపాల్ శరథ్, కార్తీక్, జగన్, లింగన్న, శేఖర్, రవి, సాయి, దినేశ్ పాల్గొన్నారు.

సంఘ భవనానికి స్థలం కేటాయించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆదిలాబాద్: వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని పెటా జిల్లా నాయకులు కోరారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఎమ్మెల్యే జోగు రామన్నకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పార్థసారథి, స్వామి, కోశాధికారి సాయికుమార్, సభ్యులు రాజేష్, మహేష్, రామేశ్వర్, నాందేవ్, జక్కుల శ్రీనివాస్, ఎస్జీఎఫ్ కార్యదర్శి కాంతారావు, మహిళా వ్యాయామ ఉపాధ్యాయులు జయశ్రీ, శకుంతల, జ్యోతి, రేణుక, లక్ష్మి పాల్గొన్నారు.